క్లుప్తంగా

వైఎస్సార్‌సీపీ ఫ్లెక్సీ కూల్చివేత



హిందూపురం: వైఎస్సార్‌సీపీ పార్లమెంట్ సమన్వయకర్త బోయ శాంతమ్మ, మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, సీఎం జగన్ చిత్రాలు కూడిన ఫ్లెక్సీని దుండగులు కూల్చివేసి ఫ్లెక్సీని చించివేశారు. సమన్వయకర్త శాంతమ్మ నివాసం ఉంటున్న మారుతీలేవుట్ వద్ద శాంతమ్మ ఫ్లెక్సీ ఏర్పాటు చేయించారు. అయితే ప్రజల్లో వైఎస్సార్‌సీపీ వస్తున్న ఆదరణను ఓర్వలేక గిట్టని వారు ఫ్లెక్సీని కూల్చివేసి చించి వేశారు. శాంతమ్మ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో టూటౌన్ పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. పార్టీ, అభ్యర్థిపై ఉన్న అక్కస్సును ఇలా ఫ్లెక్సీలు, బోర్డులపై ప్రతాపం చూపించడం సరికాదని వైఎస్సార్‌సీపీ పార్లమెంట్ సమన్వయకర్త శాంతమ్మ అన్నారు. సేవతోనే ప్రజల మనస్సు గెల్చుకోవచ్చని, ఇలాంటి నీచ రాజకీయాలతో కాదని హితవు పలికారు.

నేడు ఆత్మీయ పలకరింపు

పెనుకొండ: పట్టణంలోని 11, 14 వార్డుల్లోని తోటగేరి, రామమందిరం వీధి, దర్జీపేట, కుమ్మరదొడ్డిలతో పాటు సమీప ప్రాంతంలో బుధవారం మంత్రి ఉషశ్రీచరణ్ ఆత్మీయ పలకరింపు కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు మంత్రి కార్యాలయం ఒక ప్రకటనలో తెలిపింది. సాయంత్రం 4:30 గంటలకు తోటగేరి ఆంజనేయస్వామి దేవాలయం నుంచి కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు.

విద్యతోనే బంగారు భవిత



వార్షికోత్సవ వేడుకలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వెంకటేశ్

పావగడ: పిల్లలకు విద్య నేర్పితే బంగారు భవిత సాధిస్తారని, ఉత్తమ పౌరులుగా ఎదుగుతారని, ఎన్ని కష్టాలు ఉన్నా పిల్లలకు మాత్రం విద్యను అందించడంలో వెనుకడుగు వేయద్దని ఎమ్మెల్యే హెచ్‌వీ వెంకటేశ్ తల్లితండ్రులకు సూచించారు. తాలూకాలోని సాక్షరత గ్రామంగా పేరు పొందిన కే రాంపురంలోని ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాల వార్షికోత్స వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా పాఠశాలలో నిర్మించిన నూతన తరగతి గది, వంటశాలను ప్రారంభించారు.

సాంఘిక పరిస్థితుల ప్రతిబింబం 'భానుమతి'



భానుమతి నవలను ఆవిష్కరిస్తున్న వక్తలు

హిందూపురం టౌన్: స్వాతంత్ర్యానికి పూర్వం నాటి సాంఘిక, ఆర్థిక, కుటుంబ పరిస్థితులను భానుమతి నవల చక్కగా ప్రతిబింబించిందని దక్షిణ భారత హిందీ ప్రచార సభ అధ్యక్షుడు పోలిశెట్టి ఓబయ్య అన్నారు. మంగళవారం స్థానిక ఎస్ఎస్‌పీఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల 1930లో ఎంపీ పాపన్న గుప్త రచించిన 'భానుమతి' నవల ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపాల్ ప్రగతి అధ్యక్షత వహించగా ముఖ్యఅతిథులుగా ఓబయ్యతో పాటు పాపన్న గుప్తా కుమారుడు మోహన్, మదనపల్లి రచయిత టీఎస్ఏ కృష్ణమూర్తి, సడ్లపల్లి చిదంబర రెడ్డి, అనంతపురం ఆర్ట్స్ కళాశాల తెలుగు అధ్యాపకులు అంకె శ్రీనివాసులు పాల్గొన్నారు. ఓబయ్య మాట్లాడుతూ ఓబయ్య నవలా రచయిత పాపన్నతో తనకున్న అతి సామీప్య పరిచయ నేపథ్యాన్ని గుర్తు చేసుకున్నారు. చిదంబరరెడ్డి మాట్లాడుతూ ఓబయ్య ద్వారా తాను పొందిన సహాయ సహకారాలను గుర్తు చేస్తూ ఆనాటి మనుషుల మనసుల నిర్మలత్వాన్ని, ఉదార స్వభావాన్ని తెలియజేశారు.

బాబు మోసపూరిత హామీలను నమ్మొద్దు



ప్రచారం నిర్వహిస్తున్న చరణ్‌రెడ్డి

గోరంట్ల: 'టీడీపీ అధినేత చంద్రబాబు 2014 ఎన్నికలకు ముందు ఆచరణకు సాధ్యం కాని 600కు పైగా హామీలను ఇచ్చారు. అధికారంలోకి వచ్చాక అమలు చేయకుండా అన్ని వర్గాల ప్రజలను మోసం చేశారు. మరోసారి మోసపూరిత హామీలను ప్రజల ముందుకు వస్తున్నారు. ఆయన హామీలను ఎవరూ నమ్మొద్దు' అని రాష్ట్ర శిశు, సంక్షేమశాఖ మంత్రి, పెనుకొండ నియోజకవర్గ సమన్వయకర్త ఉషశ్రీచరణ్ భర్త చరణ్‌రెడ్డి సూచించారు. మంగళవారం గోరంట్ల మేజర్ పంచాయితీ పరిధిలోని శింగిరెడ్డిపల్లి, గోరంట్ల పట్టణంలోని నాల్గవ వార్డులోని గడ్డమీద మసీదు ఏరియాలో చరణ్‌రెడ్డి పార్టీ శ్రేణులతో కలసి 'ఆత్మీయ పలకరింపు' కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి సంక్షేమం, అభివృద్ధిని వివరించారు. పేదల అభ్యున్నతే ధ్యేయంగా పనిచేస్తున్న సీఎం వైఎస్ జగన్‌ను మరోసారి ఆశీర్వదించాలన్నారు.

సంక్షేమ సారథిని ఆశీర్వదించండి

- మంత్రి ఉషశ్రీచరణ్



పెనుకొండలో ఆత్మీయ పలకరింపు కార్యక్రమం నిర్వహిస్తున్న మంత్రి ఉషశ్రీచరణ్



పార్టీలో చేరిన వారితో మంత్రి ఉషశ్రీచరణ్

పెనుకొండ: సంక్షేమ సారథి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ప్రజలందరూ మరోసారి ఆశీర్వదించాలని రాష్ట్ర స్త్రీ, శిశు సంక్షేమశాఖామంత్రి ఉషశ్రీచరణ్ పిలుపునిచ్చారు. మంగళవారం పట్టణంలోని 15వ వార్డులోని జీవీసీ కాలనీ, పాతస్టేట్ బ్యాంక్ ప్రాంతం, వసంత వీధి, కటికర వీధిలలో కౌన్సిలర్ రఘునాథరెడ్డి నేతృత్వంలో ఆత్మీయ పలకరింపు కార్యక్రమాన్ని చేపట్టారు. ఇంటింటికీ వెళ్లి సంక్షేమం, అభివృద్ధిని వివరిస్తూ ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. గతంలో చంద్రబాబు తప్పుడు హామీలతో అధికారంలోకి వచ్చి తర్వాత అన్ని వర్గాలను మోసం చేశారన్నారు. మరోసారి మోసం చేయడానికి కుయుక్తులు పన్నుతున్నారని, ప్రజలందరూ జాగ్రత్తగా ఉండాలన్నారు. ఈ సందర్భంగా స్థానికులు పలు సమస్యలను మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. కార్యక్రమంలో నగర పంచాయతీ చైర్మన్ ఉమర్‌ఫారూక్‌ఖాన్, వైస్ చైర్మన్ బోయ సునీల్, కన్వీనర్ బోయ నరసింహ, కౌన్సిలర్లు సుధాకరరెడ్డి, తయూబ్, శేషాద్రి, జయశంకరరెడ్డి, గుట్టూరు ఆంజినేయులు, కొండలరాయుడు తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీలో చేరిక

పరిగి: మండల కేంద్రంలోని బీరప్ప ఆలయ కల్యాణ మండపంలో మంగళవారం వైఎస్సార్‌సీపీ శ్రేణులతో మంత్రి ఉషశ్రీచరణ్ ప్రత్యేక సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగానే మండల వ్యాప్తంగా 11 పంచాయతీ గ్రామాలకు చెందిన దాదాపు 550 కుటుంబ సభ్యులు వివిధ పార్టీలను వీడి మంత్రి ఉషశ్రీచరణ్ సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. కండువాలు వేసి వారందరినీ పార్టీలోకి ఆహ్వానించారు. తామంతా వివిధ పార్టీల్లో ఉన్నా సంక్షేమ పథకాలు అందాయని, ఇంతటి సంక్షేమ పాలనను గతంలో ఎప్పుడూ చూడలేదన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ నరసింహమూర్తి, రాష్ట్ర బీసీ సెల్ కార్యదర్శి డీవీ రమణ, జిల్లా కార్యదర్శి ప్రభాకర్, జెడ్పీటీసీ సభ్యుడు శ్రీరామప్ప, సింగల్ విండో మాజీ అధ్యక్షుడు మారుతీరెడ్డి, వైస్ ఎంపీపీ వేదవతి నరసింహారెడ్డి, మాజీ కన్వీనర్ జయరాం తదితరులు పాల్గొన్నారు.

'పురం' మున్సిపాలిటీకి సర్వేక్షణ్ అవార్డు

హిందూపురం: దేశ వ్యాప్తంగా తాగునీటి సరఫరాలో ఉత్తమ పర్యవేక్షణ చేస్తున్న మున్సిపాల్టీలకు కేంద్ర ప్రభుత్వం సర్వేక్షణ్ పథకం కింద అవార్డులు ప్రకటించింది. ఇందులో భాగంగా హిందూపురం మున్సిపాలిటీకి సర్వేక్షణ్ అవార్డు దక్కింది. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, కేంద్ర మంత్రుల చేతుల మీదుగా మున్సిపల్ చైర్‌పర్సన్ ఇంద్రజ, కమిషనర్ శ్రీనాథ్‌రెడ్డి అవార్డు అందుకోనున్నారు.

జీసీడీఓ ఆకస్మిక తనిఖీ



విద్యార్థులకు సూచనలిస్తున్న శివ మాధవి

సోమందేపల్లి: మండలంలోని పాపిరెడ్డిపల్లి సమీపంలో ఉన్న కేజీబీవీ పాఠశాలను గర్ల్ చైల్డ్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ (జీసీడీఓ) శివ మాధవి మంగళవారం రాత్రి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పబ్లిక్ పరీక్షకు హాజరవుతున్న ఇంటర్ విద్యార్థినులకు పలు సూచనలు, సలహాలిచ్చారు.

'గిరిజన జనగర్జన'ను జయపద్రం చేద్దాం



గిరిజన జన గర్జన పోస్టర్లు విడుదల చేస్తున్న వైఎస్సార్‌సీపీ హిందూపురం పార్లమెంట్ సమన్వయకర్త బి.శాంతమ్మ

హిందూపురం: జిల్లా కేంద్రంలో ఈనెల 10న సాయి ఆరామం వద్ద ఉదయం 10 గంటలకు ఏర్పాటు చేసిన వైఎస్సార్‌సీపీ గిరిజన జన గర్జనను జయపద్రం చేయాలని వైఎస్సార్‌సీపీ హిందూపురం నియోజకవర్గ సమన్వయకర్త టీఎన్.దీపిక, పార్లమెంట్ సమన్వయకర్త బి.శాంతమ్మ పిలుపునిచ్చారు. మంగళవారం సాయంత్రం వైఎస్సార్‌సీపీ పార్టీ కార్యాలయంలో నియోజకవర్గ సమన్వయకర్త టీఎన్. దీపిక, పార్లమెంట్ సమన్వయకర్త బి.శాంతమ్మ తన నివాసం వద్ద పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జగనన్నను మరోసారి ముఖ్యమంత్రిని చేసుకోవడమే లక్ష్యంగా గిరిజన జనగర్జన సభ నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. నియోజకవర్గం నలుమూలల నుంచి తరలివచ్చి విజయవంతం చేయాలన్నారు.

సంఘాలను బలోపేతం చేసుకోండి

రొళ్ల: గ్రామాల్లో మహిళలు ఆర్డీటీ స్వయం సహాయక సంఘాలను మరింత బలోపేతం చేసుకోవాలని ఆ సంస్థ ఏటీఎల్ ఓబులేష్ పేర్కొన్నారు. మంగళవారం మండల పరిధిలోని రత్నగిరి ఆర్డీటీ కమ్యూనిటీ భవనం ఆవరణలో ఆర్డీటీ మహిళ సంఘాల సభ్యులతో ప్రత్యేకంగా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏటీఎల్ మాట్లాడుతూ ఆర్డీటీ అందిస్తున్న సేవలు బడుగు, బలహీన వర్గాల ప్రజలు సద్వినియోగం చేసుకుని అభివృద్ధి చెందాలన్నారు. సీఓ శివప్రసాద్, సంఘ సభ్యులు, ఆర్డీటీ సిబ్బంది, సీడీసీ మెంబర్లు తదితరులు పాల్గొన్నారు.

మహిళలను గౌరవించాలి

అమరాపురం: సమాజంలో పురుషులతో పాటు స్త్రీలను సమానంగా చూడాలని ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం. జయంతి, సర్పంచ్ గిరిజమ్మ పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని తమ్మడేపల్లిలో ఆర్డీటీ, గ్రామస్తుల ఆధ్వర్యంలో మహిళా దినోత్సవాన్ని జరుపుకున్నారు. ఈ సందర్భంగా గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఆర్డీటీ కమ్యూనిటీ భవనంలో ఏర్పాటు చేసిన సమావేశంలో సర్పంచ్ గిరిజమ్మ, ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం.జయంతి మాట్లాడారు. అనంతరం పలువురు మహిళలను సన్మానించారు.

మౌలిక సదుపాయాలు ఉండాలి

రొళ్ల: ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు పోలింగ్ కేంద్రాల్లో పూర్తి స్థాయిలో మౌలిక సదుపాయాలు ఉండాలని సెక్టర్ ఆఫీసర్ శ్రీధర్ పేర్కొన్నారు. మంగళవారం మండల పరిధిలోని కె.బ్యాడిగెరలో 127, 128 పోలింగ్ కేంద్రాలను ఆయన పరిశీలించారు.

ప్రైవేట్ పాఠశాలల్లో 25 శాతం ఉచిత ప్రవేశాలు

హిందూపురం టౌన్: మండలంలోని అన్ని ప్రైవేటు పాఠశాలల్లో 2024-25 విద్యాసంవత్సరంలో 1వ తరగతిలో 25 శాతం ఉచిత ప్రవేశాలు కల్పిస్తున్నట్లు మండల విద్యాశాఖాధికారి గంగప్ప పేర్కొన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు మార్చి 14వ తేదీ లోపు అర్హులైన పిల్లల తల్లితండ్రులు www. cse. ap. gov. in వెబ్‌సైట్‌లో సంబంధిత పత్రాలను జతపరిచి దరఖాస్తు చేసుకోవాలన్నారు. అనాథ పిల్లలు, హెచ్‌ఐవీ ప్రభావిత బాధితులకు 5 శాతం, షెడ్యూల్ కులాలకు 10 శాతం, షెడ్యూల్ తెగలకు 4 శాతం, బలహీన వర్గాలు (బీసీ, మైనార్టీలు ఇతరులు) - 6 శాతం అవకాశం కల్పించనున్నట్లు చెప్పారు. దరఖాస్తు చేసుకునే వారు ఎంఈఓ కార్యాలయం, గ్రామ సచివాలయం, నెట్ సెంటర్‌లో సంప్రదించాలని సూచించారు.

యువకుడి మృతి

- పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు

పెనుకొండ రూరల్: కియా పరిశ్రమలో విధులు నిర్వహిస్తూ ఓ యువకుడు మృతి చెందిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసులు తెలిపిన వివరాలు మేరకు... అనంతపురం జిల్లా రాచనపల్లికి చెందిన చాకలి సాయి లింగా (25) గత రెండు సంవత్సరాలుగా కియా పరిశ్రమలోని ఫిట్టింగ్ సెక్షన్‌లో విధులు నిర్వహిస్తున్నాడు. సోమవారం విదులు నిర్వహిస్తూ కుప్పకూలిపోయాడు. సహచర ఉద్యోగులు హుటా హుటిన అనంతపురంలోని సవీర ఆస్పత్రికి తరలించారు. అయితే అప్పటికే సాయిలింగా మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. తండ్రి సుబ్బయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు కియా ఎస్ఐ రంగడు తెలిపారు.

చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలి



కల్లుమర్రి ఉన్నత పాఠశాలలో ఫుట్‌బాల్ ఆడుతున్న విద్యార్థినులు

మడకశిరరూరల్: విద్యార్థినులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని పీఈటీ ప్రకాష్‌రెడ్డి సూచించారు. మంగళవారం కల్లుమర్రి ఉన్నత పాఠశాల క్రీడామైదానంలో ఆర్డీటీ ఆధ్వర్యంలో మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. విద్యార్థినులు ఎంతో ఉత్సాహంతో ఫుట్‌బాల్ పోటీల్లో పాల్గొని ప్రతిభ చూపారు. ప్రతి ఏడాది మహిళా దినోత్సవం సందర్భంగా క్రీడాపోటీలను నిర్వహిస్తున్నట్లు ఆర్డీటీ ప్రతినిధులు కిశోర్, వంశీ, దుర్గాప్రసాద్ తెలిపారు. అదే విధంగా గుర్రపుకొండ, డీ గొల్లహట్టి గ్రామాల్లో ఐసీడీఎస్, గ్రామైక్య సంఘం ఆధ్వర్యంలో మహిళా దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు.

కొటిపిలో పంట కోత ప్రయోగం

హిందూపురం: హిందూపురం మండలం కొటిపి గ్రామంలో రబీ సీజన్ పంటకోత ప్రయోగాలు నిర్వహించినట్లు ఏఓ సురేంద్ర నాయక్ ప్రకటనలో తెలిపారు. మంగళవారం సర్వే నెం. 182-7 రాగి పంట కోత ప్రయోగాలు నిర్వహించామన్నారు. గ్రామంలోని రైతు గంగప్ప పొలంలో రాగి పంట ఐదు ఇన్‌టు ఐదు మీటర్ల ప్లాట్‌లో పంట కోత ప్రయోగం నిర్వహించామన్నారు. ఇందులో 20.850 కేజీల దిగుబడి వచ్చిందన్నారు.

సుదూర ప్రాంతాలకు వెళ్లి పింఛన్



తిరుపతిలో శ్రీకాంత్‌కు పింఛన్ ఇస్తున్న వలంటీర్ హనుమంతు



బెంగళూరులో చికిత్స పొందుతున్న వృద్ధుడికి పింఛన్ అందజేస్తున్న వలంటీర్లు

పెనుకొండ రూరల్: మండలంలోని రాంపురం పంచాయతీ హనుమపల్లికి చెందిన శ్రీకాంత్ అనే ఇంటర్ విద్యార్థికి దివ్యాంగుల పింఛన్ వస్తోంది. అయితే ప్రస్తుతం ఇంటర్ పరీక్షలు జరుగుతుండటంతో శ్రీకాంత్ గ్రామానికి వచ్చి పింఛన్ తీసుకోలేకపోయాడు. విషయం తెలుసుకున్న వలంటీర్ హనుమంతు తన సొంత ఖర్చుతో తిరుపతిలోని ఎస్వీ జూనియర్ కళాశాలకు వెళ్లి ఫించన్ మొత్తాన్ని అందజేశాడు.

హిందూపురం టౌన్: పట్టణంలోని త్యాగరాజ్‌నగర్ సచివాలయ పరిధిలో వలంటీర్లు పవన్, కార్తీక్‌లు మంగళవారం బెంగళూరు వెళ్లి వృద్ధుడికి పింఛన్ అందజేశారు. త్యాగరాజ్‌నగర్‌కు చెందిన పింఛన్‌దారుడు సుధాకర్ గుండె సంబంధిత వ్యాధితో బాధపడుతూ బెంగళూరులో ఉంటూ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఈ విషయం తెలుసుకున్న వలంటీర్లు తమ సొంత ఖర్చులతో హిందూపురం నుంచి బెంగళూరుకు వెళ్లి పింఛన్ సొమ్మును వృద్ధుడికి అందజేశారు.

మడకశిరలో వైఎస్సార్‌సీపీ గెలుపు ఖాయం



సమావేశంలో మాట్లాడుతున్న పోకల అశోక్‌కుమార్, చిత్రంలో వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త ఈరలక్కప్ప తదితరులు



'జగన్ రుణం తీర్చుకుందాం' కరపత్రాలు ఆవిష్కరిస్తున్న దృశ్యం

- పార్టీ శ్రేణులు ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా తీసుకోవాలి
- వైఎస్సార్‌సీపీ పరిశీలకులు పోకల అశోక్‌కుమార్, ప్రసాద్‌రెడ్డి

మడకశిర: వచ్చే ఎన్నికల్లో మడకశిరలో వైఎస్సార్‌సీపీ జెండా ఎగరడం ఖాయమని వైఎస్సార్‌సీపీ పరిశీలకులు పోకల అశోక్‌కుమార్, ప్రసాద్‌రెడ్డి, సమన్వయకర్త ఈరలక్కప్ప ధీమా వ్యక్తం చేశారు. మంగళవారం స్థానిక ఆర్అండ్‌బీ బంగ్లాలో పట్టణ కన్వీనర్ పుట్టకామప్ప అధ్యక్షతన వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో వారు మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికలను నాయకులు, కార్యకర్తలు ప్రతిష్టాత్మకంగా తీసుకుని పని చేయాలని సూచించారు. మడకశిర మున్సిపాలిటీలో వచ్చే ఎన్నికల్లో భారీ మెజార్టీ సాధించడానికి వైఎస్సార్‌సీపీ నాయకులు వార్డుల బాట కార్యక్రమాన్ని ప్రారంభించాలని వారు కోరారు. ఒక్కో వార్డుకు 10 మంది చొప్పున కమిటీ సభ్యులను నియమించుకుని పార్టీ ప్రచారాన్ని నిర్వహించాలని సూచించారు. అనంతరం నియోజకవర్గంలోని ఐదు మండలాల నాయకులతో వారు విడివిడిగా సమావేశమై పార్టీ ఎన్నికల ప్రచారంపై చర్చించారు. మాజీ మంత్రి నర్సేగౌడ్, మాజీ ఎమ్మెల్యే వైటీ ప్రభాకర్‌రెడ్డి, కుంచిటి వక్కలిగ కార్పొరేషన్ చైర్‌పర్సన్ నళిని, రొళ్ల జెడ్పీటీసీ ఆనంతరాజు, రాష్ట్ర కార్యదర్శులు వైసీ గోవర్దన్‌రెడ్డి, రవిశేఖర్‌రెడ్డి, రంగేగౌడ్, జీబీ శివకుమార్, వాగేష్, శ్రీరాములు, డైరెక్టర్లు రామకృష్ణ, వీరక్యాతరాయప్ప, గగన, నేత్రావతి, జెడ్పీటీసీలు, మండల కన్వీనర్లు, జేసీఎస్ కన్వీనర్లు, సింగల్ విండో అధ్యక్షులు, ఎంపీపీలు, వైస్ ఎంపీపీలు, కౌన్సిలర్లు సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, వివిధ కమిటీ సభ్యులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కూలీకి టికెట్ ఇచ్చే ధైర్యముందా బాబు?

- వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త ఈరలక్కప్ప

మడకశిర: ఉపాధి కూలీకి అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేయడానికి పార్టీ టికెట్ ఇచ్చే దమ్ము, ధైర్యం ఉందా? అని టీడీపీ అధినేత చంద్రబాబుపై వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త ఈరలక్కప్ప ధ్వజమెత్తారు. తనలాంటి ఉపాధి కూలీని సమన్వయకర్తగా నియమించిన ఘనత వైఎస్ జగన్‌దని తెలిపారు. వైఎస్ జగన్‌ను విమర్శించే అర్హత చంద్రబాబుకు లేదన్నారు. మంగళవారం స్థానిక ఆర్అండ్‌బీ బంగ్లాలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తాను ఎవరి మనిషిని కాదని, తాను వైఎస్ జగన్ మనిషినని స్పష్టం చేశారు. తాను కొంత మంది చెప్పు చేతుల్లో ఉన్నానని అసత్య ప్రచారం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తాను స్వతంత్రంగా వ్యవహరిస్తానని, ప్రజలు అసత్య ప్రచారాన్ని నమ్మవద్దని కోరారు. ఎమ్మెల్యే తిప్పేస్వామి తప్పకుండా తనకు సహకారం అందిస్తానని హామీ ఇచ్చారన్నారు.

కరపత్రాల ఆవిష్కరణ

మడకశిర: వచ్చే ఎన్నికల్లో రాష్ట్ర వ్యాప్తంగా పోటీ చేసే వైఎస్సార్‌సీపీ ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించుకుని ముఖ్యమంత్రి వైఎస్ జగన్ రుణం తీర్చుకుందామని నాయీ బ్రాహ్మణులకు విజ్ఞప్తి చేస్తూ తయారు చేసిన కరపత్రాలను మంగళవారం మడకశిరలో వైఎస్సార్‌సీపీ నాయకులు ఆవిష్కరించారు. నాయీ బ్రాహ్మణుల సంక్షేమానికి ప్రత్యేకంగా కార్పొరేషన్ ఏర్పాటు చేసిన ఘనత కూడా వైఎస్ జగన్‌దేనన్నారు. అన్ని వర్గాల వారు వచ్చే ఎన్నికల్లో వైఎస్ జగన్‌ను బలపరచాలని కోరారు. నాయీ బ్రాహ్మణుల కార్పొరేషన్ డైరెక్టర్ ఎల్లనూరు ప్రసాద్, స్థానిక నాయీ బ్రాహ్మణుల సంఘం నాయకులు రమేష్, నరసింహమూర్తి, బాబయ్య, మూర్తి, రంగనాథ్, ప్రసన్న, పుట్టప్ప తదతరులు పాల్గొన్నారు.

అతిథి నాయకులదే ఆధిపత్యమా?

- ప్రశ్నించిన బీసీ మహిళా నాయకురాలు పరిమళ
- ఆమెపై దురుసుగా ప్రవర్తించిన టీడీపీ నేత

హిందూపురం: పార్టీ కార్యక్రమాలకు మీరు.. ప్రభుత్వ వ్యతిరేక కార్యక్రమాలకు మేమా.. ఇదెక్కడి న్యాయమని ప్రశ్నించిన బీసీ మహిళపై టీడీపీ నాయకుడు దురుసుగా ప్రవర్తించారు. ఏక వచన సంబోధనతో బెదిరింపులకు దిగారు. ఈ నెల ఏడో తేదీన హిందూపురంలో నారా లోకేష్ పర్యటనకు జన సమీకరణ అంశంపై మంగళవారం పట్టణంలోని బాలకృష్ణ నివాసం వద్ద టీడీపీ నాయకులు సమావేశమయ్యారు. ఎమ్మెల్యే పీఏ సురేంద్ర శ్రీనివాసరావు మాట్లాడుతూ టీడీపీ నాయకులు, మున్సిపల్ మాజీ చైర్మన్లు, మాజీ కౌన్సిలర్లు అందరినీ కలుపుకొని పోవాలని సూచించారు. బీసీ సామాజికవర్గానికి చెందిన మాజీ కౌన్సిలర్ పరిమళ మాట్లాడుతూ ఎమ్మెల్యే బాలకృష్ణ వచ్చినపుడు మాత్రమే కొందరు కనిపిస్తూ..అతిథిపాత్ర పోషిస్తున్నారని, తమను మాత్రమే ప్రభుత్వ వ్యతిరేక కార్యక్రమాలకు తోస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అలా వచ్చి ఇలా వెళ్లిపోయే నాయకులే పార్టీలో ఆధిపత్యం చెలాయిస్తున్నారని మండిపడ్డారు. ఐదేళ్లుగా ప్రతిపక్ష పాత్ర పోషిస్తున్న టీడీపీ నాయకులు, కార్యకర్తలకు తగిన ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. పలువురు నాయకులు ఆమెకు మద్దతుగా నిలిచారు. ఎమ్మెల్యే పీఏ కల్పించుకుని సర్దిచెప్పారు. సమావేశం ముగిసిన తర్వాత పరిమళపై పట్టణ మాజీ ప్రజాప్రతినిధి భర్త ఆగ్రహం వ్యక్తం చేశారు. తమ గురించి ప్రస్తావించాల్సిన అవసరం ఏముంది.. నీ పని నీవు చూసుకో అంటూ ఏకవచనంతో విమర్శిస్తూ ఆమెపైకి దూసుకెళ్లారు. టీడీపీలో బీసీలకు ఏపాటి గౌరవం, గుర్తింపు ఉందో తెలుస్తోందంటూ పలువురు చర్చించుకోవడం కనిపించింది.

కంచిసముద్రంలో ఘర్షణ

పెనుకొండ: రొద్దం మండలం కంచిసముద్రంలో మంగళవారం రాత్రి జరిగిన ఘర్షణలో పలువురికి గాయాలయ్యాయి. పోలీసుల వివరాలమేరకు... కంచిసముద్రానికి చెందిన సుజాత, మమత, రామాంజినమ్మ అందించిన ఫిర్యాదు మేరకు.. పాత కక్షలను దృష్టిలో ఉంచుకొని కంచిసముద్రంకు చెందిన మురళి, అతని భార్య గాయత్రి సహకారంతో వారి వర్గీయులు దాడి చేసి తమ కుటుంబానికి చెందిన వారిని గాయపర్చినట్లు చెప్పారు. గాయపడిన వారిని పెనుకొండ ప్రభుత్వాస్పత్రికి తరలించామన్నారు. దాడికి పాల్పడినవారిపై కఠిన చర్యలు తీసుకోవాలని బాధితులు పేర్కొన్నారు.

వ్యక్తి ఆత్మహత్య

లేపాక్షి: మండలంలోని శిరివరం ఎస్సీ కాలనీకి చెందిన ఆదినారాయణ (43) ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్ఐ గోపి తెలిపారు. మృతుని భార్య వి.నరసమ్మ పోలీసులకు తెలిపిన వివరాల మేరకు... ఆదినారాయణ టెంకాయలు వ్యాపారం చేసేవాడన్నారు. అయితే వచ్చిన డబ్బును ఇంట్లో ఇవ్వకుండా మద్యం సేవించే వాడని తెలిపారు. మంగళవారం ఉదయం బాగా మద్యం సేవించి ఇంటికి వచ్చాడన్నారు. అయితే చిన్న కుమారుడు పాఠశాలకు వెళ్లకుండా మారం చేస్తుండగా ఎందుకు పాఠశాలకు వెళ్లలేదని తనపై చేయి చేసుకున్నాడని తెలిపారు. కుమారుడిని పాఠశాలకు వదిలి ఇంటికి వచ్చేలోపు తలుపులు వేసుకున్నాడని పేర్కొన్నారు. కిటికిలో నుంచి చూడగా ఇంటి పైకప్పుకు తాడుతో ఉరి వేసుకున్నాడని చెప్పారు. తలుపులు పగలగొట్టి శవాన్ని కిందకు దించగా అప్పటికే మృతి చెందాడన్నారు. మృతునికి భార్యతో పాటు ఇద్దరు కుమారులు ఉన్నారు.

విద్యార్థులకు రైటింగ్ ట్యాబ్స్ వితరణ

హిందూపురం టౌన్: పట్టణంలోని చౌడేశ్వరీ కాలనీలో యూపీ పాఠశాలలోని విద్యార్థులకు దాతల సహకారంతో రైటింగ్ ట్యాబ్స్ వితరణ చేశారు. ఈ సందర్భంగా మంగళవారం పాఠశాలలో ఎంఈఓ గంగప్ప చేతుల మీదుగా వాటిని విద్యార్థులకు అందజేశారు. దాతలు మంజునాథ్‌రెడ్డి, అమర్, పుల్లారెడ్డి, కృష్ణచైతన్యలు రైటింగ్ ట్యాబ్స్ అందించడంతో వారికి కృతజ్ఞతలు తెలిపారు. ఎంఈఓ మాట్లాడుతూ రైటింగ్ ట్యాబ్స్ ద్వారా విద్యార్థుల్లో రైటింగ్ స్కిల్స్ నైపుణ్యానికి దోహదపడతాయని అన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం మధు, ఉపాధ్యాయులు ఈశ్వర్‌రెడ్డి, ముక్తార్ పాల్గొన్నారు.

జేజేఎం పనుల నిర్వహణపై అవగాహన

గుడిబండ: మండల కేంద్రంలో వైఎస్సార్ క్రాంతి పథం కార్యాలయంలో మంగళవారం జేజేఎం పనుల నిర్వహణపై మహిళా సంఘాల సభ్యులకు అవగాహన కల్పించారు. ఏపీఎం ముత్యాలప్ప మాట్లాడుతూ జేజేఎం ద్వారా గ్రామాల్లో ఇంటింటికీ తాగునీటి కొళాయి ఏర్పాటు చేస్తున్నామన్నారు. మహిళలు పనులపై అవగాహన పెంచుకోవాలన్నారు. గ్రామాల్లో సంఘం సభ్యులు పనులు చేయాలని, చేసిన పనులకు సకాలంలో మహిళా సంఘం సభ్యుల ఖాతాల్లో డబ్బు జమ అవుతుందన్నారు. కార్యక్రమంలో ఈఓఆర్డీ, గ్రామ కార్యదర్శులు, సర్పంచులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

రుచికరమైన భోజనాన్ని వడ్డించాలి

రొళ్ల: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు జగనన్న గోరుముద్ద పథకం ద్వారా నాణ్యతతో కూడిన రుచికరమైన భోజనాన్ని వడ్డించాలని ఎంఈఓ శ్రీధర్ పేర్కొన్నారు. మంగళవారం మధ్యాహ్నం మండల పరిధిలోని కాకి, పిల్లిగుండ్ల తదితర ప్రాథమిక పాఠశాలలను సందర్శించారు. ఆయా పాఠశాలల్లో రికార్డులు తనిఖీ చేసి విద్యార్థుల హాజరు శాతాన్ని అడిగి తెలుసుకున్నారు.

గుట్టూరులో సరస్వతీ పూజ

పెనుకొండ రూరల్: మండలంలోని గుట్టూరు జెడ్పీ హైస్కూల్‌లో పదో తరగతి విద్యార్థులు సరస్వతీ పూజను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు పరీక్షల్లో మెళకువలను వివరించారు. గ్రామానికి చెందిన వెంకటేష్ విద్యార్థులకు పెన్నులు, విద్యా సామగ్రి అందచేశారు.